దంచికొట్టిన వర్షం..

- మలక్‌పేటలో వరదతో మునిగిపోయిన రోడ్లు
- మలక్‌పేట ఆర్‌యూబీలో భారీగా వరదనీరు
- వరదనీటితో రాకపోకలకు అంతరాయం
- వెళ్లలేని స్థితిలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు


మలక్‌పేటలో వరదనీటి వల్ల ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌లోని రోగి అవస్థలు


మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరదనీరు పోయేందుకు చర్యలు తీసుకుంటున్న మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు


చైతన్యపురిలో రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



మలక్‌పేటలో వరదతో మొరాయించిన అంబులెన్స్‌లోని రోగిని ఆటోలో తరలించే యత్నం

చాదర్‌ఘాట్, మే 16(ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. దంచికొట్టిన వర్షానికి మలక్‌పేటలోని ప్రధాన రోడ్లన్నీ మునిగిపోయాయి. చాదర్‌ఘాట్‌లోని మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద భారీగా వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మలకపేట ఆర్‌యూబీ నుంచి అటు చాదర్‌ఘాట్ బ్రిడ్జి, కోఠి, పుత్లీబౌలి వైపు నుంచి మలక్‌పేట వైపు వాహనాలన్నీ రోడ్డుపైనే నిలిచిపోయాయి. అదేవిధంగా మలక్‌పేట ఆర్‌యూబీ నుంచి ఇటు మలక్‌పేట నల్గొండ చౌరస్తా, న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ రోడ్డు, రైస్‌మిల్స్ వరకు వాహనాలు స్తంభించిపోయాయి. మలకపేట ఆర్‌యూబీ వద్ద వరద కారణంగా ఏర్పడిన ట్రాఫిక్ జామ్‌లో అంబులెన్స్ చిక్కుకుంది. అంబులెన్స్ ఇంజన్‌లోకి వరదనీరు పోవడంతో ముందుకు కదలేక మొరాయించింది. అందులోని రోగిపడుతున్న ఇబ్బందులను గమనించిన వాహనదారులు ఆటోలో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన ద్విచక్రవాహనాలు

భారీ వర్షం, వరద ప్రవాహం కారణంగా మలక్‌పేట రిలయన్స్ డిజిటల్ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. మలక్‌పేట పల్టన్ నుంచి ఇటు మలక్‌పేట బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం నుంచి, అటు మలక్‌పేట మార్కెట్ నుంచి వచ్చే వరద ప్రవాహం అంతా రిలయన్స్ డిజిటల్ ముందు నుంచి ప్రవహించడంతో వరద ప్రవాహం మరింత ఉధృతమైంది. దీంతో అక్కడ పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు వరద ప్రవాహానికి కొద్ది దూరం వరకు కొట్టుకుపోగా మరికొన్ని నేలకొరిగాయి.

రంగంలోకి దిగిన మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు..

మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరద కారణంగా నిలిచిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద నుంచి నాలాలోకి వరదనీరు పోయేందుకు తక్షణ చర్యలు చేపట్టడంతో సమస్య కొంత వరకు పరిష్కారమైంది.

అంబులెన్స్ ఇంజన్‌లోకి వరద నీరు, మొరాయించి..

ట్రాఫిక్‌జామ్ కారణంగా మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరదనీరు అంబులెన్స్ ఇంజన్‌లోకి వెళ్లడంతో రోడ్డుపైనే మొరాయించింది. కోదాడ నుంచి నిమ్స్‌కు మలక్‌పేట మీదుగా వెళ్తున్న ఈ అంబులెన్స్‌లోని రోగి గంట పాటు ట్రాఫిక్‌లోనే చిక్కుకున్నాడు. సాయం కోసం డయల్ 100కు చేసినా స్పందించలేదని రోగి కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. రోగికి ఆక్సిజన్ అందక ఇబ్బందిపడ్డాడు. తోటి వాహనదారులు గమనించి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన అంబులెన్స్‌లోని రోగిని ఆటోలో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

సైదాబాద్‌లో..

సైదాబాద్: సైదాబాద్ పరిసరాలలో కురిసిన భారీ వర్షానికి రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. ఎల్‌ఐసీ కాలనీ రోడ్డుపై భారీ వృక్షం కూలిపోగా, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సమస్యను కాలనీవాసులు ఆస్మాన్‌ఘడ్ డీఈ హన్మంతరెడ్డి దృష్టికి తీసుకుపోగా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించారు. చంపాపేట ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాలు నిలిచిపోయి కొద్దిసేపు ట్రాఫిక్ జాం ఏర్పడింది.

చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలోని ఆయా కాలనీలు, బస్తీల్లో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. ఆకాశం నల్లని మబ్బులతో ఏర్పడింది. బలమైన గాలులు వీయడంతో వర్షం అరకొరగా కురిసింది. రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది. వాహనదారులు గంటపాటు ఇబ్బందులకు గురైనారు.

కాలనీల్లో చేరిన వరదనీరు.. పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు..

వనస్థలిపురం: భారీ వర్షానికి విజయవాడ జాతీయ రహదారి చింతలకుంట, పనామా, హైకోర్టుకాలనీ, భాగ్యలత వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో తక్షణమే స్పందించిన మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంతో వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి. అదేవిధంగా మన్సూరాబాద్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన అనితనగర్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, సాయినాథ్‌కాలనీ, హిమపురికాలనీల్లో వరదనీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. కామినేని ఆస్పత్రి సమీపంలోని రహదారిపై డ్రైనేజీలు పొంగిపొర్లడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లింది. దీంతో అటుగా వెళ్లే బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాగోల్ డివిజన్‌లోని మమతనగర్, బండ్లగూడ, అయ్యప్పకాలనీల్లో వరదనీరుతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది మ్యాన్‌హోల్స్‌ను ఓపెన్‌చేసి వరదనీరు తొలగింపు చర్యలు చేపడుతున్నారు.


మలక్‌పేటలో వరద కారణంగా నిలిచిపోయిన వాహనాలు

కొట్టుకుపోయిన తోపుడు బండ్లు, టూవీలర్లు

ఓల్డ్ మలకపేట: ఓల్డ్‌మలకపేటలో వర్షం బీభత్సం సృష్టించింది. వర్షానికి ఓల్డ్ మలకపేటలోని పలు కాలనీలు జలమయమైనాయి. పోచమ్మఆలయం వద్ద వరద ఉధృతికి గుడి కొంత మేర మునిగిపోయింది. వరద దాటికి రోడ్లపైన నిలిపిన టూవీలర్లు, తోపుడు బండ్లు కొట్టుకుపోయాయి. పైన ఉన్న వ్యవసాయ మార్కెట్, అక్బర్‌బాగ్ నుంచి పెద్ద ఎత్తున వరద రావడంతో లోతట్టు ప్రాంతాలైన మున్సిపల్‌కాలనీ, ధోబీగల్లి, రేస్‌కోర్స్ కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లు కాలువల్లా మారాయి. రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ కొట్టుకుపోయాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది మ్యాన్‌హోల్లు కొట్టుకుపోయిన చోట కొత్తవి ఏర్పాటు చేశారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

చైతన్యపురిలో స్తంభించిన ట్రాఫిక్..

ఎల్బీనగర్: వర్షంతో దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, సరూర్‌నగర్ ఆర్‌కేపురంలలో రోడ్లపైకి వరదనీరు వచ్చి చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షపునీరు రహదారిపైకి వచ్చిచేరడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. పీఅండ్‌టీకాలనీ, న్యూగడ్డిఅన్నారం ప్రాంతంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీటితో నదిని తలపించింది. విజయపురికాలనీలో వరదనీరు నిలిచిపోవడంతో కొద్దిసేపు ప్రజలు ఇబ్బందిపడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అక్కడికి చేరుకుని జీహెచ్ఎంసీ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు. ప్రభాత్‌నగర్‌కాలనీలో భారీ వృక్షం నేలకూలింది. చైతన్యపురిలో కార్పొరేటర్ నర్సింహగుప్తా, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ సుజాత పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.


కొట్టుకుపోతున్న తోపుడు బండి


విజయవాడ జాతీయ రహదారి చింతలకుంట వద్ద చేరిన వర్షపునీరు


రెడ్డికాలనీలో కురిసిన వర్షానికి రహదారిపై పారుతున్న వరద నీరు


ఎల్‌ఐసీ కాలనీలో కూలిన భారీ వృక్షం


ప్రభాత్‌నగర్‌లో నేలకొరిగిన భారీ వృక్షం


చంపాపేట ప్రధాన రహదారిపై వరద నీరు



విజయపురికాలనీని సందర్శిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్


చైతన్యపురిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ సుజాత తదితరులు


దిల్‌సుఖ్‌నగర్ రహదారిపై వరదనీరు


రైతుల పక్షాన ఆందోళన చేస్తున్న సిరికొండ నర్సింహారెడ్డి, రాము, లక్ష్మణ్

వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి

చంపాపేట, మే 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన సన్న, దొడ్డు రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని మలిదశ ఉద్యమకారులు సిరికొండ నర్సింహారెడ్డి, రాము, లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు గురువారం చంపాపేట చౌరస్తాలో ఉద్యమకారులు రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, రైతులకిచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో హబీబ్ మహ్మద్, పండు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్కేటింగ్ పోటీలకు ఎంపిక అభినందనీయం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


క్రీడాకారిణి నందితను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌కు చెందిన టంగుటూరి నందిత ఆగస్టులో ఇటలీలో జరుగనున్న ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సెలక్షన్‌లో బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు కూతురు నందిత ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా గురువారం వారు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేని కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నందితను ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం వనస్థలిపురం డివిజన్ ఏ టైప్ క్వాటర్స్‌లో రోలర్ స్కేటింగ్ రింక్ గ్రౌండ్ నిర్మించామన్నారు. ఆ గ్రౌండ్‌లో శిక్షణ పొందిన నందిత పలు రాష్ట్రాల్లో నిర్వహించిన క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబర్చడంతో ప్రపంచ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ మేరకు తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులకు, కోచ్ శ్రీనివాస్, సత్యంలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సైంటిస్ట్ చంద్రకాంత్

పత్తి సాగు విధానంపై అవగాహన సదస్సు

హయత్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): నాగపూర్ కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో జిల్లా వ్యవసాయ అధికారులు, పత్తి విత్తన సంస్థలతో గురువారం హయత్‌నగర్‌లోని క్రీడాలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధిక సాంద్రత, పత్తిసాగు విధానం, దగ్గర అంతర పత్తి సాగువిధానంపై అవగాహన కల్పించారు. సాగు విధానంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై సాంకేతిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్ డాక్టర్. చంద్రకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి, ప్రత్యేక పత్తి ప్రాజెక్టు నోడల్ అధికారి డాక్టర్. విజయ్‌కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, నివేదిత, ఎల్‌వీ ప్రసాద్, సూర్యప్రకాష్, కిరన్ కుమార్‌రెడ్డి, సుధీర్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.


పీహెచ్‌సీ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు

డెంగీపై అవగాహన ర్యాలీ, సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 16(ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ దేను పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్. శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. నీటి నిల్వల వద్ద దోమలు గుడ్లు పెడుతాయని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. తాగునీటిలోనే డెంగీ దోమ పెరుగుతుందన్నారు. ఇంట్లోని పాత్రలు, పూలకుండీల పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఎస్‌యూఓ హేమ్‌లాల్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఎంపీహెచ్ఈవో లక్ష్మీనారాయణ, నిర్మల, నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

- జీహెచ్ఎంసీ అధికారులకు డిప్యూటీ మేయర్ ఆదేశాలు

తార్నాక, మే 16(ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా నగర ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన రహదారులపై మురుగు నిలిచిపోకుండా, విరిగిపడ్డ చెట్ల కొమ్మలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు తమతమ ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలు వర్షం కారణంగా ఎటువంటి ఇబ్బందులకు గురైనా వెంటనే జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్‌కి ఫిర్యాదు చేయాలని కోరారు.

పాత గొడవల నేపథ్యంలో ఒకరి ఇంటిపై దాడి

- బాధితుడు పవన్‌కల్యాణ్ ఇంట్లో సెక్యూరిటీ గార్డు

సరూర్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో కొందరు వ్యక్తులు ఓ వ్యక్తి ఇంటిపై దాడి చేసి నానా రభస సృష్టించారు. ఇంట్లోని వస్తువులను చిందరవందర చేసి ఇంటి కిటికీల అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుడు సినీ హీరో పవన్‌కల్యాణ్ ఇంటికి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరుగగా, దాడికి పాల్పడిన వారిలో ఐదుగురిని మీర్‌పేట్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మీర్‌పేట్‌లోని లెనిన్‌నగర్‌లో నివసించే బి.వెంకట్ నటుడు పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఆయన ఇంటికి ఎదురుగా నివసించే రఘు కుటుంబంతో కొంత కాలంగా వ్యక్తిగత కారణాలతో వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇరు కుటుంబాల మధ్య వివాదం జరుగగా వెంకట్ మరో ఇద్దరితో కలిసి రఘుపై దాడి చేశారు. దాంతో రఘు బుధవారం రాత్రి తన బంధువుల, స్నేహితులతో కలిసి వెంకట్ ఇంటికి వచ్చి రాళ్లు, కర్రలతో ఇంటిపై దాడి చేశాడు. ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని, ఇంటి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధితుడు వెంకట్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన వారిలో రఘు, ఆయన భార్య సరితతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

22న టీఎస్ పీసీబీ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యావరణ, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్ తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో సనత్‌నగర్‌లోని టీఎస్ పీసీబీ కార్యాలయంలో పోటీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాలల విద్యార్థులు నేరుగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సినిమా థియేటర్లు ఓపెన్

చిక్కడపల్లి : ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సినిమా థియేటర్లు తెరిచే ఉంటాయని, ఏదో ఒక సినిమా నడిపిస్తామని తెలంగాణ ఫిలిం ఎగ్జిబిటర్ల సంఘం సభ్యుడు బాల్‌గోవింద్‌రాజ్ తెలిపారు. సినిమాలు రాకపోవడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లు కొన్ని రోజులు మూతపడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్త సినిమాలు వస్తే మళ్లీ తెరుస్తారని తెలిపారు.

మూఢనమ్మకాలను తరిమికొట్టిన వీరబ్రహ్మేంద్రస్వామి

- కవి, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్

ఎల్బీనగర్, మే 16(ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలను తరిమికొట్టిన మహానుభావుడు కాలజ్ఞాన సృష్టికర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని కవి, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్ కొనియాడారు. వర్కర్స్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి అధ్యక్షతన గురువారం కొత్తపేటలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బ్రహ్మంగారి ఆలోచన.. మన కర్తవ్యం అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అంటరానితనం తీవ్రంగా అమలవుతున్న ఆ రోజుల్లో కుల, మత, వర్గ, వర్ణాలకు అతీతంగా జ్ఞానాన్ని బోధించిన మహాజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి అని అన్నారు. స్త్రీ జాతి పక్షపాతి అని సమాజంలోని మూఢ నమ్మకాల విశ్వాసాలను ఖండిస్తూ సమాజంలో మార్పు కోసం పోరాడాలని 450 సంవత్సరాల క్రితమే బ్రహ్మంగారు చెప్పారన్నారు. ముందుచూపుతో బ్రహ్మం గారు రాసిన కాలజ్ఞానం ఈనాటికి నిజమవుతున్నాయన్నారు. తెలుగు సాహిత్యంలో ఎన్నో రచనలు చేసి ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించిన చైతన్యమూర్తి బ్రహ్మంగారని ఆయన కొనియాడారు. సామాజిక ఉద్యమకారుడు మోహన్ బైరాగి, వర్కర్స్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌దుర్గేలు మాట్లాడుతూ కుల, మత, వర్గ, వర్ణాలకు అతీతంగా మానవతావాదిగా 17వ శతాబ్దంలో దక్షిణ భారతదేశ ప్రజల్లో చైతన్యం రగిలించిన సంఘసంస్కర్త వీరబ్రహ్మంగారన్నారు. ఆయన కోరుకున్న ఆశయాలను మనం కొనసాగించినప్పుడే నిజమైన మార్పు వస్తుందన్నారు. పాండురంగాచారి మాట్లాడుతూ అభ్యుదయవాదిగా సమాజంలో మార్పు అనివార్యమని బ్రహ్మంగారు ఆనాడే చెప్పారన్నారు. నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న బ్రహ్మంగారి విగ్రహం వద్ద ఈనెల 17న బ్రహ్మంగారి ఆరాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మారోజు సునీల్‌కుమార్, వర్కర్స్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రాములు, బడే అజయ్‌కుమార్, కృష్ణమాచారి, శ్యాంసుందర్, సోమేశ్వర్‌రావు, శ్రీకాంతాచారి, విజయలక్ష్మీ, వరలక్ష్మి, రాజేశ్వర్‌రావు, వెంకటరెడ్డి, పాండురంగాచారి, భాస్కర్, లింగాచారి, వెంకటాచారి, శివతేజ, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో రమేష్, పాండురంగాచారి తదితరులు

బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో అడ్మిషన్లు

- జూన్ 10 నుంచి 15 వరకు ర్యాలీ

అల్వాల్, మే 16 (ఆంధ్రజ్యోతి): బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ(బీఎస్‌సీ) మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ స్పోర్ట్స్ అథ్లెటిక్స్ కేడెట్స్‌ను చేర్చుకునేందుకు జూన్ 10 నుంచి 15వ తేదీ వరకు మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ వెల్లింగ్‌టన్(నీలగిరి)లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరినాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్‌సీ అనేది స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆర్మీ మధ్య జాయింట్ వెంచర్. భవిష్యత్‌లో నిర్వహించే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలను గెలుచుకోవడానికి ర్యాలీలో ఎంపిక చేసిన కేడెట్స్‌ను తీర్చిదిద్దుతారు. క్రీడా విభాగంలో సెలక్షన్ ట్రయల్స్ ఫిజికల్ అండ్ టెక్నికల్ స్కిల్స్ టెస్ట్‌లను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌లు, బోర్డ్ ఆఫ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. దరఖాస్తుదారుడి వయస్సు 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉం డాలి. (2010 జూన్ 9 నుంచి 2016 జూన్ 10)లోపు జన్మించిన వారై ఉండాలి. కనీసం 2వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపిక సమయంలో మెడికల్ ఆఫీసర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ ద్వారా మెడికల్ ఫిట్‌నెస్‌ను నిర్ధారిస్తారు. శరీరంలో ఏ భాగంలోనైనా శాశ్వత టాటూ ఉన్న అభ్యర్థులు ర్యాలీలో పాల్గొనడానికి అనర్హులు. అర్హత గల అభ్యర్థులు ది బ్లాక్ బ్రిడ్జ్, ది మద్రాస్ రెజిమెంటల్ సెంటర్, వెల్లింగ్‌టన్(నీలగిరి)లో 2024 జూన్ 10న ఉదయం 7 నుంచి 12 గంటల వరకు రిపోర్ట్ చేయవచ్చు. మరిన్ని వివరాల కోసం 8848545629, 9790808233లో సంప్రదించవచ్చు.

రోడ్డుపై మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తిపై దాడి

బర్కత్‌పుర: రోడ్డుపై మద్యం తాగొద్దన్నందుకు నలుగురు వ్యక్తులు ఓ ప్రైవేట్ ఉద్యోగిపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూనగర్‌లో నివాసముంటున్న ఏ. శ్రీకాంత్‌గౌడ్(33) ప్రైవేట్ ఉద్యోగి. బుధవారం రాత్రి నెహ్రూనగర్ వెస్ట్రన్ బేకరీ నుంచి ఇంటికి వెళ్తుండగా రోడ్డుపై నలుగురు వ్యక్తులు కూర్చొని మద్యం తాగుతున్నారు. రోడ్డుపై కూర్చుని ఎందుకు మద్యం తాగుతున్నారంటూ శ్రీకాంత్‌గౌడ్ వారిని మందలించడంతో కోపంతో నలుగురు దాడికి పాల్పడ్డారు. శ్రీకాంత్‌గౌడ్‌పై జరిగిన దాడిలో ఆయన కంటి వద్ద తీవ్ర గాయమైంది. దాడికి పాల్పడిన బాలాజీ, మాధవ్, కార్తీక్, నిఖిలేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. శ్రీకాంత్‌గౌడ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి రాజు : 99854 02786